
# నాకు నచ్చిన నా కథ



మధురాంతకం రాజారాం

మనిషిచేసిన రాయిరప్పలకు మొక్కులు చెల్లిస్తూ ఆ మనిషిని రాయికన్నా హీనంగాచూసే మనుషుల్ని చూచి మనసున్నవాళ్ళు వాపోతుంటారు. రూల్సు విషయమున్నా అంతే: మనిషి చేసిన రూల్సుకు మాత్రమే ప్రాధాన్యం యిస్తూ రూల్సుచేసిన మనిషిని తృణీకరిస్తున్న సమాజంలో మనిషి యంత్రంగా పరిణమించక తప్పదు. మరైతే ఎట్టి సమాజంలోనైనా ఏటి కెదురీదేవాళ్ళు కొందరుంటారు. వాళ్ల మనిషి చేసిన రూల్సును మనిషికోసం అతిక్రమించడంలో తప్పు లేదనుకుంటారు. ఆచరణలోగూడా ఆ పంథానే అనుసరిస్తారు. వాళ్ల పనిష్మెంట్లను లెక్కబెట్టరు. అపహాస్యాలను ఖాతరుచెయ్యరు. డబ్బు, దర్పం, హోదా మొదలైనవన్నీ వాళ్ల దృష్టిలో మిథ్యా విలువలు.

'ఈ కథలో పాత్రలు కేవలం కల్పితం' అనే స్టేటుమెంటుపట్ల నాకు నమ్మకం లేదు. ప్రస్తుతం కథలోని ముఖ్యపాత్రతో నాకు చిరకాలంగా పరిచయం వుంది. ఇందులోని సంఘటనల్లోగూడా ఎక్కువభాగం వాస్తవంగా జరిగినవే. కథ జీవితానికి ఎంత సన్నిహితంగా వుంటుందో అంతగా రచయితకు సంతృప్తి కలుగుతుందన్నది నా స్వానుభవం.

ఇది నాకు నచ్చిన నా కథ చదివినవాళ్ళకుగూడా నచ్చినప్పుడే నా కానందం.

# పిచ్చి వెంకట్రావు

ఏభాషలోనైనా పడికట్టు మాటలని కొన్ని వుంటాయి. 'ఆత్మబలం' అనేది అలాంటివాటిలో ఒకటేమోనని నా అనుమానం! అడపా దడపా మనం వండుకుతినే ఒక కాయను నేతిబీరకాయగా వ్యవహరించడం లేదా? అలాంటి బలమే కావాలి, ఆత్మబలం గూడా! సిసలైన భౌతిక దృష్టిలో లెక్కగడితే, మనిషి కున్న శక్తుల పరిమితి చాలా స్వల్పం! ఏదీ, ఒక పెద్ద రాతిగుండును తలకెత్తుకోమనండి చూద్దాం! చేతుల బలంతో ఒక చిన్న యినుపగుండును పిండి గొట్టమనండి, ఒప్పుకుందాం! అంతెందుకు, పిడికెడు ఉక్కు శనగలు నమిలి, మింగి జీర్ణంచేసుకోవడమైనా, సాధ్యం కాదే! వాస్తవం యిదై వుండగా లోకంలో ఎక్కడా లేని, ఓ బలం తన ఆధీనంలో వున్నట్టు ఊహించి, దానికి అందంగా 'ఆత్మబల' మని పేరుగూడా పెట్టుకున్న మానవుణ్ణి చూస్తుంటే జాలి పుట్టుకొస్తుంది! నా మనోరాజ్యపు వంటింట్లో కూర్చుని రకరకాల అపోహల పాలిటికి తిరుగులేని దివ్య రసాయనాలను తయారు చెయ్యడం నా వృత్తిగాదులెండి, హాబీ! ఆత్మబలమనే అపోహను సోదార్చడం కోసం, ఘాటైన ఓ పేషంటు మందును తయారు చెయ్యడానికని ఒక వంటింటి కుందేటితో నా కెంతో కాలంగా అవసరం వుంది. చిరకాలానికి నా కోరిక నెరవేరింది. అయాచితంగా వో వ్యక్తి రంగంలో ప్రవేశించాడు...

అసలింతకూ పిచ్చి వెంకట్రావుగారికన్నా ముందుగా ఆయన కీర్తి మా వూళ్ళో అడుగు పెట్టిందనిచెప్పాలి. మడతలు చెరిగి, మడతలుపడిన దుస్తుల్నయినా ఆయన ఏమాత్రం బిడియం లేకుండా తొడుక్కోగలడు. తల దువ్వుకున్నాడన్న మాట ఆయన జీవిత చరిత్రలో ఎప్పుడో అరుదుగాగానీ కనిపించని విశేషం. శుభ్రంగా ఆయన చొక్కా గుండీలు వేసుకోగా చూసినవాళ్ళు లేరు. మిట్టమధ్యాహ్నపు మిడిమిడి ఎండలో చెప్పులులేని వట్టిపాదాలతో తారురోడ్డుపైన నడవగలగడం ఆయనకే చెల్లు! అలాగని యిలాంటి వాలకంవల్ల ఈయన లుబ్ధాగ్రేసరుడని ఒక నిర్ణయానికి రావడానికి సైతం వీల్లేకపోవడమే! విచిత్రం తుఫాన్లు, కరువులు, అగ్నిప్రమాదాల్లాంటి అవాంతరాలు వచ్చినప్పుడు (తన తరువాత వాళ్ళని మొగమాటంలో పెట్టాలన్న దురుద్దేశంతోనే కావాలి!) చందాల జాబితాలో తన అంతస్తుకు మించిన పెద్దసంఖ్య వేయడం ఈయనరివాజు. అన్నింటికీమించి

ఈయన వ్యక్తిత్వంలో కొట్టవచ్చినట్టుగా కనిపించే ప్రత్యేక లక్షణం ఒకటుంది. అదేమిటంటే — తనను తాను మరచిపోవడం! ఆఫీసు రూంలో కూచుంటే దీపాలు వెలిగి జాము రేతిరి గడచినా పని పూర్తయ్యేదాకా పైకి లేవడు. క్లాసులో పాఠం చెబుతుంటే, గంట మ్రోగినా చెవిలో పడదు. రోడ్డుపైన ఏమాత్రం పరిచితుడు ఎదురైనా వాడి బాగోగులన్నీ సాకల్యంగా విచారించి, తన మూలంగా అతడి కేదైనా తోడ్పాటు అవసరమనిపిస్తే, ఆ పని చేపట్టిన తర్వాత గానీ, ఆయన తృప్తిగా నిట్టూర్చడు. ఒకటా రెండా! ఇలా ఎన్నో లీలలు వెంకట్రావుగారివి! అన్నట్లు మరొక ముఖ్యమైన వర్తమానం. వెయ్యికి మించిన విద్యార్థులతో అదొక రాజ్యంలా ఉన్న పెద్ద హైస్కూలు నుంచీ ఈయన ఒక మారుమూల కొంపకు కొట్టుకొచ్చాడంటే యిందుకు కారణం గూడా పనిష్మెంట్ ట్రాన్స్ఫరేనట!

ఎంత శిక్షకు అంత నేరం వుండివుండాలి. అదేమిటని తెలుసుకోవాలని పించడం సహజం. రాబోతున్న పై ఉద్యోగిని గురించిన వివరాలను ఆరాతీసి, తెలుసుకోవడంలో నా సహోద్యోగులు చెప్పుకోదగ్గ శ్రద్ధ తీసుకున్నారని, నిస్సందేహంగా చెప్పగలను.


గుడిలోపలి విగ్రహాన్ని మూలవిరాట్టుగానూ, జిల్లా విద్యాధ్యక్షుణ్ణి నేల పైన నడియాడే ప్రత్యక్ష దైవతంగానూ భావించడం, తదనుగుణంగా, నడుచు కోడం, టెంకాయలోకి వచ్చే నీళ్ళలా పరిషత్తు ఉద్యోగుల్లో చోటుచేసుకునే సుగుణం. ఎన్నికలు జరిగి కొత్త అధ్యక్షుడు ఆఫీసు భవనాలకి అవతారమెత్తి రెండేళ్లు గడచినా, ఈ ప్రబుద్ధుడు, వెంకట్రావుగారు మచ్చుకొకసారైనా శ్రీవారి భేటీకి వెళ్ళలేదంటే, యితడిదంతా ఉలిపికట్టె వాలకమని, చెప్పడానికి యింకొక దృష్టాంతరం అనవసరం! 'ఎందరెందరో కొమ్ములు తిరిగినవాళ్ళే వెళ్ళొచ్చారు. మీరూ వెళ్ళిరావాలి. అనిష్టమైనందుకు కోప్పడతారేమో! పరవాలేదు. దాసరి తప్పులు దండముతో సరి!' అంటూ శ్రేయోభిలాషులు బోధించక పోలేదు. అయితే ఆ హితవు నేమి లెక్కపెట్టకుండా ఈ పిచ్చి వెంకట్రావు మహాశయుడు 'అయ్యా! చేర్మనుగారయ్యేదీ, చెవుంపిల్లిగారయ్యేదీ, ఆయనతో నాకు పని వుంటేనే నేను వెళ్ళేది. పనిలేకుండా వెళ్ళి గొప్పవాళ్ళ అమూల్యమైన కాలాన్ని పాడుచేసే హక్కు నా కెక్కడుంది?' అనేవాడట! మరైతే అవిధేయతను వహించడానికైనా, ఓ హద్దుంటుంది గదా! వేచిచూసే ఓపిక నశించి స్వయంగా చేర్మనుగారే ఒకసారి స్కూలుపైకి, 'విజిటేత్తి వచ్చేశారట! వచ్చింది కారులోనా! మరేమన్నానా? శబ్దం వినిపించగానే గబగబా పరుగెత్తి రావద్దా? చేదోయి ఫాలలా

తలానికి సోకగా నమస్కారం చెప్పవద్దా? దయచేయండి అంటూ సంభ్రమంగా లోపలికి తీసుకెళ్ళే కనీసపు మర్యాదకైనా, కదుపు రావడమా! చేర్మనుగారు కారు దిగి మెట్లెక్కి టక్కుటక్కుమంటూ నడుచుకుంటూ వెళ్ళి, ఎట్టయెదుట నిలబడే టంతవరకూ ఈయన గుండ్రాయిలా కుర్చీలో బైఠాయించే వున్నాడట! అప్పుడిక తల పైకెత్తి చూశాడేమో నింపాదిగా లేచి నిల్చుంటూ ఒక నమస్కారం చెల్లించి దిక్కులేని హుందాతనమంతా వెళ్ళబోస్తూ, 'అయ్యా! కూచోండి, అన్నాడట! సరే, ఆయన తల పంకించి వుంటాడు. ఇతగాడితో మాట లెందుకు లెమ్మని చకచకా తనదారిని తాను వెళ్ళిపోయి వుంటాడు. ఆయనలా వెళ్ళిపోగానే సహోపాధ్యాయులు ఈయనగారిని చుట్టుముట్టి ఒక వరుస జాడించి పారేశారట! అప్పుడీయన నిజంగానే బిక్కమొగం పెట్టి 'ఆగండి బాబూ! ఆగండి! "శాంతి శాంతి!" అంటూ అభయవచనాలు ప్రారంభించేశాడట! 'అయ్యలారా! మీరందరూ బుద్ధిమంతులు, నా మూలంగా యిక్కడేదో పెద్ద అపచారం జరిగిపోయినట్టు మీరు భావించడం నా మట్టుకు నాకు ఒక భ్రమా ప్రమాదంగానే తోస్తూవుంది. ఇప్పుడు వచ్చి వెళ్ళిన చేర్మనుగారిలాంటి వాళ్ళని కొన్ని వేలమందిని నా యీ చేతులతో నేను మలిచాను. అందుకొకరు నన్ను గౌరవించాలని నేననుకోను, చేర్మనుగారు మాత్రం అవసరంలేని మర్యాదలకోసం అర్రులు చాస్తారని మీరెందుకనుకుంటారో నా కర్థం గాదు, ఆయన గౌరవం ఆయనకు చెల్లించబడింది మీ పాటుకు మీరు వెళ్ళండి' అంటూ ఈయన — తనకు బుద్ధిచెప్పడంకోసం వచ్చినవాళ్ళను మెత్త మెత్తగా దులిపి పంపించేశాడట!

అంతే సంగతులు! పదిరోజులు తిరగకమునుపే ట్రాన్స్ఫర్ ఆర్డర్ చేతి కందింది.

ఎంతటి గడుగ్గాయి ఉద్యోగస్థుడైనా తన తప్పు తాను తెలుసుకోవలసిన సందర్భం, ఇక్కడదేం లేకపోయింది. ఈ దుస్థితికి మూలకారణమైన తన బుద్ధి మాలినతనాన్ని నిందించుకొనడం పోయి, ఈ దుర్గతి, ఈ కిడికి లుంగలు చుట్టుకుని కృంగిపోవలసింది పోయి, అప్పటికి బదిలీ ఉత్తరువు నేషనల్ అవార్డుతో సమానమైనట్టు, నిటారుగా తల పైకెత్తుకుని బాణావరానికి విజయం చేశారు వెంకట్రావుగారు!

'అయ్యో! పాపం! ఎంతపని జరిగిపోయిందండీ!' అంటూ ఓదార్చడం కోసం తనను పరివేష్టించిన ఉపాధ్యాయ బృందాన్ని ఉద్దేశించి. పరిసరాల్లోకి కలయజూస్తూ ఆయన ప్రారంభించేశాడు. 'ఇదేనటండీ స్కూలు! అహా, ఏం




పూచాయండీ యిక్కడ మోదుగుచెట్లు: దూరంగా ఎవడో దేవతా పురుషుడు పడు కున్నట్టు పెద్ద కొండ: దాన్నిండుగా పచ్చని చెట్లు, అక్కడినుంచి మామిడితోపులు, పామీరు ముడిలాంటి మిట్టపైన బడి, హాయిగా, ప్రశాంతంగా మాడల్ స్కూలంటే యిలాగే వుండాలి.'

ఏడవాలో, నవ్వాలో, తోచిందిగాదు నాకు: బాణావరంలో వున్న ఏకైక అయ్యరు హోటల్లో వరుసగా వారం రోజులపాటు భోజనం చేసినవాడు. అన్నం కన్నా ఆకులలములు మేయడమే సుఖమన్న నిర్ణయానికి రాగలడు, ప్రొద్దుపోయి గాలికాస్తా ఛల్లబడితే చుట్టుపక్కల మెట్టపొలాల్లో ఉన్న పాములన్నీ పచారు సల్పడానికని వూళ్ళోకి వచ్చేస్తాయి. ఎండాకాలాల్లో త్రాగడానికి నీళ్లు దొరికితే బ్రహ్మాండం. చలికాలాల్లో విషజ్వరాల కిది ఇష్టారాజ్యం. వెరశి అన్ని ఋతువుల లోను పరిత్యజనీయం బాణావరం: ప్రత్యేకించి హైస్కూలు హెడ్మాష్టరుకు యిక్కడ ఎదురయ్యే అదనపు బాధ ఒకటుంది. ఈ స్కూలుకు పోష్టుచేయబడ్డ ఏ టీచరుకైనా యిదొక ఉజిలీయేగానీ, గమ్యస్థానం కాదు. ఆరుబయల్లో నెల కొల్పబడి నప్పటికీ జైలు జైలే: జైలు వార్డెన్లలాంటి ఈ టీచర్ల కన్ని విధాలా తగినవాళ్ళే విద్యార్థులు గూడా: వీళ్ల చదువులపైన పెద్దపెద్ద ఆశలు పెట్టుకోరు. పడుతూ లేస్తూ, పదోతరగతిదాకా బండిలాగి, ఓ మాస్తరు ఉన్న కొలువును అంది పుచ్చుకోవా లనుకుంటారు. కొట్టినట్టుగా కొడితే, ఏడ్చినట్టుగా ఏడుస్తానన్న

భార్యాభర్తల ఒప్పందంలాంటిది యిక్కడ గురువులకు శిష్యులకు మధ్య అమల్లో వుందనుకోవచ్చు. పరిషత్తు వాళ్ళ యాజమాన్యం క్రింద ఎడారులు ధ్రువ ప్రాంతాలు శీతామయ ప్రదేశాలు మొదలైనవి లేకపోవడంవల్ల ప్రవాసశిక్ష విధింగడాని కనువుగా యిదొక్కటే మిగిలింది. ఈ బడిని బాగుచేసే ప్రధానోపాధ్యాయుడు గతంలో పుట్టలేదు. భవిష్యత్తులో పుట్టడు.

ఇలాంటి హైస్కూలు ఒకటి కేవలం తనకోసంగానే ఏర్పాటై వున్నట్టు వెంకట్రావుగారు అమందానందం వెళ్ళబోస్తూ౦ావడం మాకందరికీ చాలా ఆశ్చర్యం కలిగించింది. రేయింబవళ్ళు ఆయన ఆఫీసు రూములోనే తిష్ఠ వేసేవాడు. విద్యార్థులు గనుక లాంథరాలు వెలిగించుకొని బడి కొచ్చేస్తే రాత్రివేళ గూడా పాఠాలు చెప్పడానికి సిద్ధపడ్డాడు. పారా పలుగూ కడవలూ బకెటూ తెప్పించి సాయంకాలాల్లో పూలతోట పెంపకానికి చర్యలు తీసుకున్నాడు. మరుభూమిలో 'పచ్చ విప్లవం' ప్రారంభమైందంటే నమ్మడం కష్టమే. ఇందులో 'సిన్సియారిటీ' పాలెంతో, నటన పాలెంతో తెలుసుకునే కుతూహలంతో వోరోజు ఉదయం యింకా భళ్ళుమని తెల్లవారకముందే స్కూల్లోకి వెళ్ళాను. శుభ్రంగా ముఖాలు కడుక్కొని, పద్మాసనాలు వేసుకుని, చేసిపెట్టిన బొమ్మల్లా కుర్రవాళ్ళు పాఠాలు వల్లించుకుంటున్నారు.

హెడ్మాష్టరుగారు తొలికోడితో లేచి స్నానానికి వెళ్ళినట్టు తెలిసింది. బస్సుపైన బాణావరాని కొస్తుండగా రోడ్డు కల్లంతదూరంలో ఆయన కొక చెరువు కనిపించిందట. చెరువు నీరు ఎంతో స్వచ్ఛంగా వున్నట్టు తోచడంతో యికపైన తన కదేస్నానఘట్టంగా ఆయన నిర్ధారణ చేసేశాడట. వూరికీ, చెరువుకూ మధ్య దూరం ఎంతలేదన్నా మూడు కిలోమీటర్లకు తక్కువుండదు.

దారిలో బడి బంట్రోతు సుబ్బన్న ఎదురయ్యాడు. రంగారావు వెళ్ళి అయ్యగారికోసం అప్పటమైన పాలు తీసుకొస్తున్నాడట.

"అదేమిటోయ్ సుబ్బన్నా! అయ్యగారికి ఉండూరు పాడు సరిపడవా?" అన్నాను.

"ఇదొక్కటే గదండీ ఆయనకున్న ఆదరువు. ఉదయం అరపడిపాలు పుచ్చుకుంటే, రాత్రుల్లో మిలిగిన అరపడితోపాటు రెండో, మూడో అరటిపళ్ళు పుచ్చుకుంటాడు. మధ్యాన్నం ఒకపూట ఏం తింటాడో అదే తినడం? ఈ మారాజొచ్చినప్పటినుంచీ మధ్యాహ్నాల్లో నేను యింటికెళ్ళడం లేదనుకోండి. కారియర్‌లో మిగిలివున్నదేదో నాకూ సరిపోతుంది. ఇక్కడమాత్రమే కాదులెండి,

ఆయ నెప్పుడూ యింతేనట! తిండి తినడంకోసం పుట్టినవాడిలా కనిపించడు...."
మాట్లాడుతూ కెరటంలా ముందుకు సాగిపోయాడు సుబ్బన్న.

మనిషి పిట్టలా వుంటాడు. పిట్ట మేతలతో పొట్టపోసుకోవడం సముచితమే!

హాస్య రసభరితమైన పుస్తకాన్ని చదువుతూ, చదువుతూ మధ్య మధ్యలో అందులోని సంఘటనల్ని నెమరుకుతెచ్చుకొని కాసేపు నవ్వుకోడం చదువరుల కందరికీ అనుభవంలోని విషయం. మా స్టాఫ్ మెంబర్ల కిప్పుడు అలాంటి కాల క్షేపానికి కొదవ లేకపోయింది. "ఈరోజేం జరిగిందో తెలుసా!" అంటూ ఒకరు. ఆ ఉదంతం పూర్తయ్యీ కాకమునుపే "మీకు తెలుసునో తెలియదో, మొన్న యింకొక తమాషా జరిగింది" అంటూ యింకొకరు! ఏకిన ప్రత్తిలోనుంచీ నూలు పోగును తీసినట్టుగా, వెంకట్రావుగారి దినచర్యలనుంచీ, రకరకాల వినోదోదంతాల్ని వెలికితెయ్యడం సహోపాధ్యాయుల కొక ఎక్స్ట్రాకరిక్యులర్ యాక్టివిటీ' అయిపోయింది.

పదకొండున్నరకు సరిగ్గా రెండో పీరియడ్ పూర్తవుతుంది. వో రోజు ఉదయం పెద్దముల్లు 'ఏడు'ను సమీపిస్తున్నా గంట మ్రోగకపోవడం గమనించి వెంకట్రావుగారు 'సుబ్బన్నా, గంట కొట్టు' అంటూ హెచ్చరిక చేశారు. 'సుబ్బన్న పోస్టాఫీసుకు వెళ్ళాడండీ! ఇంకా రాలేదు' అన్నాడు గుమాస్తా. 'ట్రయిన్ లేటయింది గదూ! ఈ టపా రావటమూ లేటే! సుబ్బన్న గూడా డిటో' అన్నాడు, జూనియరు తెలుగు పండితుడు నాధముని. 'ఒక రోజు ట్రెయిన్ రాదనుకోండి! ఆ రోజంతా యితడు పోస్టాఫీసు వదిలిపెట్టి బడికి రాడన్నమాటే గదా!' అంటూ వో ఛలోక్తి విసిరాడు హిస్టరీ అసిస్టెంటు రామసుబ్బారెడ్డి. వాళ్ళల్లో వాళ్ళిలా తర్జనభర్జనలు పడుతుండగానే టంగుటంగున గంట రెండు సార్లు మ్రోగింది. 'ఏదీ సుబ్బన్న వచ్చేశాడా! లేదే' అనుకుంటూ వాళ్ళు వరండాలోకి తొంగిచూచేసరికి సుత్తిని యధాస్థానంలో వుంచి హెడ్మాష్టరుగారు తిరిగొస్తున్నారు.

ప్యూనుకే 'సబ్స్టిట్యూటుగా' వ్యవహరించగలిగిన తర్వాత హెడ్మాష్టరు గారు అసిస్టెంటు టీచర్లకాపాటి ఉపకారం చెయ్యడానికి ముందుకు రావడంలో విడ్డూర మేముంది? టీచరు సెలవుపెట్టడంవల్ల ఏ క్లాసయితే బిడువుగా వుంటుందో, అక్కడల్లా ఆయన్ను చూడొచ్చు. నారదుడికి శ్రీకృష్ణపరమాత్ముడు తన అష్ట భార్యల మందిరాల్లో కనిపించినట్టుగా ఒక రూములో ఆరో తరగతి కుర్రాళ్ళకు వేమన నీతిపద్యాలు వివరిస్తూ వెంకట్రావుగారు, ఇంకొక గదిలో

ఏడో తరగతికి ఆర్కి మెడిస్ సూత్రం బోధిస్తూ వెంకట్రావుగారు, వేరొకచోట ఎనిమిదో తరగతి గదిలో ద్వివర్గ సమీకరణలు విశదీకరిస్తూ వెంకట్రావుగారు.

వెంకట్రావుగారి విశ్వరూపాన్ని చూసినకొద్దీ నాకు లోపల్లోపల ఆయన పట్ల అనుతాపం కలిగిన మాట వాస్తవం. తోడి మానవుణ్ణిగా ఆయనకు తగువైన సలహా ఒకటి యివ్వదలచుకున్నాను. వయసులోను, ఉద్యోగస్థాయిలోను ఆయనకూ నాకూ వున్న తేడాను పురస్కరించుకుని నా సలహాను వీలయినంతలో ఒక విజ్ఞప్తిగానే తీర్చిదిద్దాను "చూడండి సార్! మీరూ బాగా పెద్దవాళ్ళయి పోయారు. మన శరీరాలు ఉక్కుతో చేసినవేమీ కావు. ఇవి తట్టుకోగల చాకిరీకి హద్దంటూ ఒకటుంటుంది. మీవంటి వారు తమకు మాలిన ధర్మాల జోలికి వెళ్ళకపోవడం చాలా మంచిది..."

తన శరీరంపైకొక్కసారి చూచుకుని ఎంతో నిర్లక్ష్యంగా నాలుక చప్పరించేశారు, వెంకట్రావుగారు. "వోయబ్బ! ఈ శరీరాని కేముందిలేవోయ్ రాఘవులూ! ఇదొక పనిముట్టు. దీనితో ఎంత మాగ్జిమమ్' పని చేయించుకోవచ్చో, అంతా చేయించుకోవాలయ్యా! బద్ధకం వహించినంత మేరకు యిది త్రుప్పుపట్టి పోతుందనుకో...."

ఈ మనిషి కిలా చెప్పినందువల్ల లాభంలేదు. ఇంతకంటే సూటిగానే చెప్పాలి. అయ్యా! శరీరం నీది. కావలిస్తే దాన్ని ఎలాంటి గ్లానికైనా గురిచెయ్యి. నీ యిష్టం. కానీ మానవజన్మ మెత్తిన తర్వాత, అందులోనూ ఒక హైస్కూలుకు హెడ్మాస్టరువైన తర్వాత మనిషికి ఆత్మగౌరవమనేది చాలా ముఖ్యమనే విషయం నీకు తోచకపోవడం దురదృష్టం.... ఇలా ఎన్నో మాటలు నాలుక చివరిదాకా వచ్చాయి, కానీ యిన్ని మాటలూ చెప్పెయ్యడానికొక సందర్భం రావాలి.

వచ్చింది.

ఓ రోజు వుదయం పదిగంటలప్పుడు నేను స్కూలుకు వెళ్ళేసరికి అప్పటికప్పుడే చేసుకున్న నిర్ణయంపైన కోయగూడెంలో జరుగుతున్న జాతరలా స్టాఫ్‌రూంలో సందడిగా వుంది. 'ఏం జరిగిందర్రా, ఏమిటి విశేషం?' అన్న నా ప్రశ్నకు నవ్వులే సమాధానం. ఒకటి రెండు నిమిషాలు బ్రతిమాలుకున్న తర్వాత ఒక సహోపాధ్యాయుడు "అదేమిటయ్యా రాఘవులూ! రోకలి తీసుకు రాకుండా వట్టిచేతులతో వచ్చేశావే? అయ్యగారికి పిచ్చి కుదిరిందట. ఇక రోకలి తలకు చుట్టడమే తరువాయి" అన్నాడు.

ఏం జరిగిం దేం జరిగిందంటూ మళ్ళీ మొదటికే వచ్చాను.

ఫస్టు అసిస్టెంటు సదాశివయ్య సూర్యోదయాన్ని కళ్ళజూచి ఎరుగని వ్యక్తి. ఎనిమిదికో ఎనిమిదిన్నరకో ఎదీ ఆ పూట బడి వుందని జ్ఞాపకం వస్తే గాని అతను మంచాన్ని వదిలిపెట్టడు. అలాంటి సదాశివయ్యకీ రోజు వుదయం అయిదు గంటలకే నిద్రాభంగం కలిగింది. ఈ దురాగతానికి కారకుడు మరెవ్వరో కాదు. సాక్షాత్తుగా హెడ్మాస్టరు వెంకట్రావుగారు. తలుపు దబదబా బాది, ఇంటావిడ వచ్చి తలుపు తీయగానే సుడగాలిలా లోపలికి వెళ్ళి ఈయన ఫస్టు అసిస్టెంటును నిద్ర లేపేశాడట! "సదాశివం! ఇదిగోనయ్యా లీవు లెటరు. రెండు రోజులపాటు నువ్వు ఇన్-చార్జీగా స్కూలు చూచుకోవాలి, నే నర్జంటుగా వూరు వెళ్తున్నాను. టీచర్సు రిజిష్టరులో నా పేరు కెదురుగా ఎర్రసిరాతో 'సి యల్' గుర్తించడం మరచిపోవద్దు. ఐనా తెల్లవారిపోతుండగా యింకా నిద్రేమిటి? ఈ పాటికి కలకత్తాలో నాలుగు బారల ప్రొద్దెక్కి వుంటుంది...." అంటూ అదే దూసుకపోవడం బస్టాండువైపు!

"కలకత్తాలోకన్నా రంగూన్‌లో, కౌలాలంపూరులో, టోకియోలో యింకా ముందుగానే తెల్లవారిపోతుంది. అందుకని రాజశ్రీ హెడ్మాస్టరుగారు చెప్పే దేమిటి? ఈ భూప్రపంచంపైన ఏ మానవుడైనా గానివ్వు, ఏ వేళప్పుడైనా గానివ్వు నిద్రపోవడానికి వీల్లేదనేగదా!" ఎవరికి తోచిన వ్యాఖ్యానాలు వాళ్ళు రువ్వుతున్నారు. ఒకరికంటే బిగ్గరగా ఒకరు నవ్వుతున్నారు.


వెంకట్రావుగారు బాణావరానికి వచ్చి మూడు నెలలయితే, చివరి మూడు నెలల్లో మా యిద్దరికీ మధ్య సాన్నిహిత్యం కాస్తా చిక్కబడింది. మరేంలేదు. వికారమైన ముఖానికొక అందమైన 'మాస్క్' తగిలించినట్టుగా సకాలంలో తగు సలహాలివ్వడం ద్వారా, చేయిమించి పోయినప్పుడు కొన్నికొన్ని సర్దుబాట్లు చేయడంద్వారా నేను హెడ్మాస్టరుగారి ప్రవర్తనకు మెరుగులు దిద్దడానికి ప్రయత్నించాను. చివరి పదిపదిహేను రోజుల్లో అందులో కొంతవరకూ కృతకృత్యుడి నయ్యాను గూడా! కానీ అంతలోనే మళ్ళీ ఓ తప్పటడుగు! నిజంగానే నాకు తల కొట్టివేసినట్టయింది.

వూరునుంచి తిరిగి రాగానే నాకు దొరికిన మొదటి అవకాశంలో నేను వెంకట్రావుగారిపైన విరుచుకపడ్డాను.

"మీరు నన్ను గురించి ఏమైనా అనుకోండిసార్! ఫరవాలేదు. నేను చెప్పదలచుకున్నదేదో చెప్పేస్తాను. మీరు చేసే పనులు నా కేమీ బాగుండడంలేదు.

సంఘంలోని ఒక్కొక్క మనిషికీ, అతడీవిధంగా మాత్రమే నడచుకోవాలని కొన్ని నియమాలుంటాయి. ఇంగ్లీషులో రూల్సు అనుకోండి, నాకే మభ్యంతరం లేదు. ఒకవేళ మీరు మరచిపోయినా నేను మీకు జ్ఞాపకం చేస్తున్నాను. మీరొక విద్యాసంస్థకు పెద్దగా వున్నారు. సెలవు పెట్టదలచుకుంటే ప్యూనుద్వారా ఫస్టు అసిస్టెంటుకు కబురుపెడతారు. అతడు రాగానే తాళంచెవులు అప్పగించి మీ పనిపైన వెళ్తారు. అంతేగానీ, స్వయంగా అసిస్టెంటు టీచరుయింటికి వెళ్ళి తలుపు దబదబా బాదే హెడ్మాస్టరుంటాడా ఎక్కడైనా! ఒక టీచరు సెలవులో వున్నందువల్ల అతడి క్లాసు ఖాళీగా వున్నప్పుడు పనిలేకుండా వున్న యింకొక టీచరును యాక్టింగు వర్కుకు వెయ్యడం రివాజు! అలా కాకుండా తగుదునమ్మా అని ఆల్‌రౌండు మాస్టరులాగా అన్ని క్లాసులూ మీరే తీసుకుంటారా? అన్నింటి కన్నా ఘోరమైన విషయం. హెడ్మాస్టరుగా మీ కుండవలసిన హుందాతన మంతా నట్టేట్లో కలిపి సీట్లోనుంచి లేచివెళ్ళి గంట కొట్టివస్తారటండీ మీరు!"

ఎట్టఎదుటి ఆకారంలో కదలిక లేదు. నిశ్చలమైన ముఖభంగిమను బట్టి చూస్తే ఆయన నా మాటల్ని సాకల్యంగా విన్నట్టే తోచింది. కుర్చీలో సర్దుకుని కూర్చున్న తీరు, సులోచనాలను సవరించుకున్న తరహా పై పెదవి క్రింది పెదవితో ముడిపడుతూ విడివడిన పద్ధతి ఈ చిన్నెలద్వారా ఆయనలో ఏదో తిరుగుబాటు ప్రకోపిస్తూ వున్న జాడల్ని పసిగట్టాను. ఇన్ని దినాలుగ నాకు పరిచితుడైన ఈ వ్యక్తిలో యింతవరకూ నా వూహాకందని విలక్షణాలేవో పొంగి పొరలివచ్చి, నన్ను ముంచివేయబోతున్నట్టుగా వుంది. మిస్టర్ రాఘవులూ! అంటూ పిలుపు వినిపించేసరికి వులిక్కిపడకుండా వుండలేకపోయాను.— "వీ కొకడు ప్యూనైతే నువ్వింకోడికి ప్యూనా! ఎంత మంచి ప్యూన్ల ప్రపంచమయ్యా మీది! తనకు సెలవు కావలసివస్తే సదాశివయ్య నా దగ్గిరి కొస్తుండగా లేనిది దారిలో వున్నాడు గదా అని నే నతడితో ఒక మాటచెప్పి వెళ్ళేసరికి నా కెక్కడలేని తలవంపులొచ్చాయనేనా నువ్వనేది! గోళ్లుగిల్లుకుంటూ కూర్చున్న విద్యార్థుల్ని వెదికిపట్టి, వాళ్ళకు నాలుగు ముక్కలు చెప్పడానికి గూడా నా హెడ్మాస్టరుగిరీ అడ్డొస్తుందంటావా? పోతే, ప్యూనొచ్చేదాక నువు గంట మ్రోగగూడదంటావు, ఎందుకు బాబూ! మహాత్ముడు పాకీపని చేయడం గొప్ప ఆదర్శంగా తలపోయడం లేదా నువ్వు! వ్యక్తిత్వం నుంచి ఉద్యోగాన్ని మైనస్‌చేసి సంతకు తీసుకెళ్తే, ఎర్రని ఏగానీ చెయ్యని నేను ఒకసారి బడిగంట కొట్టడంవల్ల నువ్వు చెబుతున్న 'రూలు'కు ఎక్కడలేని సేగి వచ్చిపడిందా? నాన్సెన్స్! ఈ బోడిరూల్సు




సంగతి నాతో చెప్పొద్దు! ఏమిటయ్యా నీ రూలు? ఎవడు చేసిందీ రూలు? మొదట మనిషి. తరువాత రూలు. మనిషిచేసిన 'రూల్సును' మనిషి కోసం అతిక్రమిస్తే తప్పని నేననుకోను. అవసరమైతే నేనా మాత్రం పనిచెయ్యడానికి వెనుదియ్యను గూడా! ఏ లౌకికశక్తీ నన్ను అడ్డుకోలేదు...."

కింగ్‌కాంగు, గామా, కోడి రామ్మూర్తుల్లాంటి వాళ్ళెవరైనా యిలా ఒక సవాలు విసిరితే అ దారి వేరు! తమ శారీరక బలమైనా వారికి ఆసరాగా వుండి ఉండేది. ఒక మాదిరి దృఢకాయుడు భుజాలపైన చేయివేసి అదిమితే అమాంతంగా భూగర్భంలోకి కృంగిపోయేట్టున్న అబ్బనాకారపు మనిషి ఏ బలాన్ని నమ్ముకుని యింతింతలేసి మాటలు మాటాడేటట్టు?

నా కప్పుడనిపించింది.

పేరుకు ముందుగా 'పిచ్చి' అన్న విశేషణం తగిలించడంతో లోకం ఈ తిక్కమనిషిని సముచితంగానే సన్మానించింది.... అని!

ఐతే వెంకట్రావుగారు నిజంగా పిచ్చివాడే కావడానికిన్ని, కాకపోవడానికిన్నీ వున్న మధ్యదూర మేపాటిదో నా కా క్షణాన బోధపడలేదు. ఆయన పిచ్చితనాన్ని గురించి నికరంగా ఒక నిర్ధారణకు రావలసిన అగత్యం రానున్న కొద్ది రోజుల్లో వొంచివుందని గూడా నేనప్పట్లో వూహించలేదు.

ఏం జరిగిందంటే....

ఓ రోజు వుదయం మామూలుగానే బడి ప్రారంభమైంది. ఇంటర్వెల్లో

కుర్రవాళ్ళు బయటికి వెళ్ళిన తరువాత మూడో పీరియడ్ జరుగుతోంది. మెయిన్ బిల్డింగుకు దూరంగా చెట్లక్రింద కుర్చీవేసుకొని, విద్యార్థులచేత కాంపోజిషన్ వ్రాయిస్తూ నా పనిలో నేను నిమగ్నుడినైవుండగా పెద్దపెట్టున గగ్గోలు చెలరేగడం వినిపించింది. కొందరయ్యవార్లు, విద్యార్థులు గూడా క్లాసులు వదలిపెట్టి కలసి కట్టగట్టుకుని స్టాఫ్‌రూంవైపు పరుగెత్తుతున్నారు. ఆ అలజడిలో అసలు విషయమేమిటో తెలుసుకోవడానికైనా వీలుకావడంలేదు. ఎదురీత గొట్టి, ఏటిపైకి వ్రాలిన కొమ్మను పట్టుకొన్నట్టుగా జనాన్ని తోసుకుంటూ వెళ్ళి స్టాఫ్‌రూం కిటికీ దగ్గరికి చేరుకోగలిగాను. ఎగశ్వాస, దిగశ్వాసల పురవడితో రొప్పుకొంటూ డ్రాయింగు మాష్టరు మురహరి లోపలి బెంచీపైన పడివున్నాడు.

చాలా దయనీయ గాథ మురహరిది. స్వయంగా తనదేమో మెతక మనసు. మృగాలలాంటి మనుషులమధ్య జీవనం. బాణావరానికి మూడుమైళ్ళ దూరంలోవున్న స్వగ్రామంనుంచీ ప్రతిరోజు బడికివచ్చి వెళ్తుంటాడు. నాలుగు మాసాల క్రిందట కోర్టులో వుండిన కేసొకటి తనకు వ్యతిరేకంగా తీర్పురావడంతో అతడు మానసికంగా బాగా దెబ్బతిన్నాడు. దానికి తోడు పెద్ద జబ్బు చేసింది. 'రక్తహీనత' అన్న కారణంతో పసిరికలు వచ్చిందన్నారు. రెండు నెలలపాటు రాణీపేట ఆసుపత్రిలో వుండివచ్చాడు. లేతవయసు పెళ్ళాంతో బాటుగా, నలుసులలాంటి యిద్దరు పిల్లలు గూడా వున్నారు. మురహరి ఉద్యోగ మొక్కటే ఆ కుటుంబానికున్న జీవనాధారం.

నాటువైద్యుడు నాగాచారి గసబోసుకుంటూ వచ్చాడు. తన తాత ముత్తాతలు చేసిపెట్టిపోయిన కట్టుమాత్రలతో బాణావరం జబ్బులపైన రకరకాల వింత ప్రయోగాలు చేయడం అతడి ప్రత్యేకత. ప్రాణభయం వుందనిపిస్తే అతడు రోగి దరిదాపుల్లోనే వుండడు. ఒళ్ళంతా చలువలు క్రమ్ముకపోతూ వుండడాన్ని బట్టి, నాడి మందగించడాన్నిబట్టి నాగాచారి పెదవి విరిచేశాడు. 'రెండు గంటల టైములో గవర్నమెంటు ఆసుపత్రికి తీసుకెళ్ళాల్సివుంది. బలమైన ఇంజక్షన్లిచ్చి, గ్లూకోజు గూడా ఎక్కిస్తే ఆ పైన అంతా దైవాధీనం. మొత్తం పైన యముడితో జటాజొటీగా పోట్లాడవలసిన పరిస్థితి' అంటూ తేల్చి చెప్పేశాడు.

మధ్యాహ్నం దాటిన తరువాత గానీ బాణావరం నుంచి పట్నానికి బస్సులు లేవు. ఇప్పటికిప్పుడు రైలు మాత్రం వుంది. అది పన్నెండు ముప్పావుకల్లా స్టేషను వదిలి పెడుతుంది.

అలోగా పేషంటును స్టేషను దగ్గరికి చేరవెయ్యగల్గడం సాధ్యమేనా?

కష్టం.

సాధ్యంకాదు.

బాణావరంలో జట్కాలు లేవు. ఎద్దులబండే శరణ్యం.

తలచుకున్నపాటున బండి ఎక్కడ దొరుకుతుంది?

సందేహాల కతీతంగా ఈ ప్రాంతంలో ఎక్కడో బండి అనేది ఒకటి వుండితీరాలి-అన్న నమ్మకం ఒక్క హెడ్మాస్టరుగారి ముఖంలో మట్టుకే కవిపించింది. జండాకొయ్య కోసం కట్టిపెట్టిన ఎత్తయిన తిన్నెపై కెక్కి ఆయన నాలుగువైపులకు పరకాయించిచూచారు. పొలాల్లోకిఎరువు తోలుకుని వెళ్ళి ఖాళీగా తిరిగొస్తున్న బండి ఒకటి తుప్పల చాటున దోబూచులాడినట్లుగా కనపిస్తూ వుంది.

రాఘవులూ! "అదిగోనయ్యా బండి. పరుగెత్తు, అడ్డుదారి పట్టుకునిపొలాల పైన్నే తోలుకొచ్చేయమని చెప్పు. ఇక్కడున్నట్టుగా రావాలి."

అదృష్టవశాత్తు బండి తోలుతున్న రైతు నాకు పరిచితుడే; మీదు మిక్కిలి వాళ్ళబ్బాయి ఒకడు హైస్కూలులో చదువుతున్నాడు గూడానేమో. చెప్పగానే అతడు నా పిలుపునందుకున్నాడు. అఘమేఘాలపైనే తోలుకుంటూ వచ్చి బండిని స్కూలుగేటు దగ్గర నిలిపివేశాడు.

జబ్బుమనిషిని చేతులపైన బండిలోకి తీసుకెళ్ళడం జరిగింది.

కదిలిన బండిలోకెక్కి కూర్చుంటూ హెడ్మాస్టరుగారు నన్నొక్కణ్ణి మాత్రం తన వెంట రమ్మన్నారు. స్టేషనుదాకా వచ్చి రైలెక్కించి వచ్చేస్తామని చెబుతూ అయిదారుగురు విద్యార్థులు మాత్రం నాతోబాటుగా బండిని వెంబడించారు.

గిట్టలతో ఎండు దుమ్మును ఎగజిమ్ముకుంటూ కోడెలు పరుగెడుతున్నాయి.

అది గ్రామం నుంచీ స్టేషనుదాకా ప్రత్యేకంగా వేయబడ్డ మట్టిబాట. ఇంచుమించు రైలు దారికి సమాంతరంగా వుంటుంది, మధ్యలో వంద గజాల మేరకు ఎర్రమట్టిచేలు వ్యాపించి వున్నాయి.

బండ నారిగాడి గుట్ట దాటింది. బైరాగులసత్రం దాటింది. ఇంకెంతదూరం? వో అరమైలుంటుందేమో....

కాలచక్రంతో పోటీకి తలపడ్డట్టుగా బండిచక్రం గిర్రుగిర్రున తిరిగేస్తోంది.

రెండింటిలో ఏది గెలుస్తుంది?

కాలమా? వేగమా?

కన్నుమూసి కన్ను తెరిచేటంతసేపట్లో పందెం ఒక ముగింపుకు రావచ్చునని మాత్రం మాలో ఎవ్వరూ అనుకోలేదు.

పందెం ముగిసేటప్పటికి—

మోరలు పైకెత్తి రోజుకుంటున్న కోడెలు, పగ్గాలు బిగబట్టి రైలుదారివైపు తెల్లబోయి చూస్తున్న రైతు, ఫుల్‌స్టాపు పెట్టినట్లుగా నిశ్చల వృత్తిని అవలంభించిన బండి, లేచి బండిపైన నిల్చుని 'వచ్చేస్తూవున్నది నిజంగా రైలుబండేనా' అన్నట్లు దిగ్భ్రాంతికి లోనైవున్న వెంకట్రావుగారు—

'ఏది ఏమైనా తనకేమీ కాబట్టనట్టు ధీమాగా, ఎవరేమైనా తనకేమీ చింత లేనట్లు గంభీరంగా తనపాటున తాను పొగలు చిమ్ముకుంటూ రైలుబండి జైత్రి పోతులా ముందుకు దూసుకుని వచ్చేస్తోంది.

ఒకటి.... రెండు.... మూడు.... కాలపురుషుని కర్కశపాదాల చప్పుడులా క్షణాలు దొర్లిపోతున్నాయి.


గడచిపోయిన క్షణంలో ఏం జరిగిందో మనకు తెలుసు. గడుస్తున్న క్షణంలో ఏం జరుగుతున్నది తెలుసు కానీ రానున్న క్షణంలో ఏర్పడబోయే పరిణామానికి సంబంధించినంతవరకూ మనిషి వూహ విల్లునులాగి వదిలిపెట్టిన బాణం. గురికి తగిలినా తగలొచ్చు. తప్పిపోయినా పోవచ్చు.

ఉన్నట్టుండి చేతిని పైకెత్తి వెంకట్రావుగారు 'ఆపండి, ఆపండి' అంటూ ఎలుగెత్తి కేకవెయ్యడం వినిపించింది. మరుక్షణంలో బండిపైన్నుంచీ అలాగ్గా క్రిందికి దూకి 'ఆపండాపండి' అని చెయ్యి వూపుతూ ఆయన చేను కడ్డంపడి రైలు కభిముఖంగా పరిగెత్తడం కనిపించింది.

నొగపైన కూర్చున్న రైతు పూర్తిగా అయోమయావస్థలోనైనా పడిపోయి వుండాలి. లేదా కాడిక్రింద గిత్తలు బెదిరిపోవడమైనా జరిగివుండాలి. తనంతట తానే స్వాతంత్ర్యం ప్రకటించుకున్నట్టు బండి రోడ్డు కడ్డంతిరిగి పొలాలవెంట పరుగెడుతూ వెంకట్రావుగారిని వెంబడిస్తోంది.

తన స్పృహలో తానున్న మానవు దెవడైనప్పటికీ, యిలాంటి అవకతవక పనికి పూనుకోడేమో। బుద్ధి అదుపుతప్పి, మనసుగూడా స్వాధీనంలో లేనప్పుడు మానవుణ్ణి ఆవహించుకునే విపరీత స్థితిని ఉన్మాద మంటారు. అలాంటి ఉన్మాదంలో తల మునకలైవున్న మానవుడు రైలుబండిని ఆపుచెయ్యడం మట్టుకే గాదు, గ్రహ గతుల్ని స్థంభింపజెయ్యడం గూడా తన కనుసన్నలతో జరిగి పోయే పనిగా భావించగలడు।

వెంకట్రావుగారి ఆక్రోశాన్ని చెవిలో వేసుకోకుండా యింజను ఆయన్ని దాటిపోయింది. ఏడెనిమిది గూడ్సుపెట్టెలు గూడా ఇంజన్ను అనుసరించాయి.




మన్నించాలి. అంతవరకే నాకు తెలిసింది. అప్పటినుంచీ మళ్ళీ రెండు మూడు నిమిషాలవరకూ నా కళ్ళఎదుట నెలకొన్న దృశ్యాలు గానివ్వండి. ఎదురైన అనుభవాలు గానివ్వండి, సినిమా ప్రొజక్టరులో బొమ్మల్లా ఒకదాన్ని తరుముకుంటూ ఒకటిగా పరుగుతీశాయి. క్రమంగా వేగంతగ్గి రైలుబండి నిలకడలోకి రావడం, వెంకట్రావుగా రొక్కగంతులో మెట్లపైకి దూకి తలుపు లోపలికి తొయ్యడం బండివాడి తోడ్పాటుతో విద్యార్థులు మురహరిని కంపార్టుమెంటులోకి చేరవెయ్యడం జీవచైతన్యానికి అతీతంగా బిర్రబిగుసుకుపోయిన నన్నెవరో కదిపి, ముందుకు తోసి పెట్టెలోకి ఎక్కించడం, ఇంతపనీ జరిగినతర్వాత బుద్ధిగా చెప్పిన మాట వినే మంచిపిల్లవాడిలా బండి మెల్లగా ముందుకు సాగబారడం — ఈ సంఘటనల సముదాయమంతా నాపాలిటికొక స్వప్న వృత్తాంతంగానే తోచింది.

నా తెలివి నాకు వచ్చి జరిగింది కలగాదన్న నిర్ధారణకు వచ్చినతర్వాత నా కింక మిగిలిన సందేహం ఒక్కటే. ఎలా నిలిచిపోయి వుంటుంది బండి? ఏ శక్తి దాన్ని ఆపుచేయగలిగి వుంటుంది?

వెంకట్రావు గారొక వేళ పిచ్చివాడు గాకపోతే, గొప్ప మంత్రగాడయినా కావాలి. నా చిన్నతనంలో మా తాతగారు చెబుతుండేవారు, మంత్రతంత్రాలతో, బలితర్పణాలతో శక్తిని పూజించి ప్రసన్నం చేసుకున్న వాళ్ళకు అసాధ్యం

అంటూ వుండదట. చికటి విచ్చిపోకముందే నిద్రలేచి వూరికి దూరంగా వున్న చెరుదగ్గరికి వెళ్ళి ఈయన చేసుకొచ్చేది శక్తిపూజే అయివుండొచ్చు....

నా బుద్ధి పోతున్న పోకడను గమనించేసరికి నేను సిగ్గుతో కుంచించుకు పోయాను. ఆకాశాపకాశంలో చంద్రగ్రహానికే రహదారి వెయ్యగలిగిన అధునిక విజ్ఞానం దేవుళ్ళ అస్తిత్వాన్నిగానీ, దయ్యాల ఉనికినిగాని లెక్కలోకి తీసుకోదు. ప్రపంచం పైన ఎక్కడ, ఎంతటి మహత్కార్యం జరిగినా అందుకు సజావైన కారణం ఒకటి వుండి తీరాలంటుంది. ఒక పట్టాన స్ఫురించక పోవచ్చు, ఆలోచించి, అన్వేషించి తెలుసుకోమంటుంది.

త్రుళ్ళిపడినట్టుగా నేను తలపైకెత్తి వెంకట్రావుగారివైపు చూచాను. ఆయన మురహరి తలను తొడపై పెట్టుకుని అంగవస్త్రం అంచుల్ని విసనకర్రలా విప్పి ముఖానికి చల్లగా గాలిసోకేటట్టు మెల్లగా విసురుతున్నారు.

రైలెలా ఆగిపోయిందన్న ప్రశ్నను గాలికి వదిలిపెట్టి, జబ్బుమనిషికి తగు సపర్యలు చేయడమే తక్షణ కర్తవ్యంగా ఆయన తలపోస్తున్నట్టుంది.

ముందు జాగ్రత్తలన్నీ తీసుకుని తిరుపతికొండకు 'యిలుతీర్థం' వెళుతున్న కుటుంబం ఒకటి మాకా పెట్టెలో తారసిల్లింది. ముఖ్యంగా ఆ కుటుంబంలోని వృద్ధదంపతులకు అనుకోకుండా ఓ వ్యాసంగం సమకూరినట్టయింది. తాము ఫ్లాస్కులో తెచ్చుకున్న కాఫీని వాళ్ళు ఒకొక్కక్క బొట్టుగా రోగిచేత తాగించారు. అమృతాంజనం డబ్బి పైకితీసి గుండెలపైన వెచ్చగా రుద్దమన్నారు. "మీరిక భయపడకండి! మరేం పరవాలేదు, మంచి సూది ఒకటి పడితే మనిషి కోలుకుంటాడు" అంటూ దారిపొడుగునా ధైర్యవచనాలు చెప్పసాగారు.

దిగవలసిన స్టేషన్లో బండి ఆగింది.

త్రోపుడు బండి తీసుకురావలసిందని పోర్టరుద్వారా కబురుపెట్టారు వెంకట్రావుగారు. త్వరగా లాక్కొచ్చేటట్టు చూడమని నన్నుగూడా పోర్టరువెంట పరుగెత్తమన్నారు. ప్లాటుఫారంపైన జనాల రద్దీ విపరీతంగా వుంది. ఏ సందులో నుంచీ ఎలా మాయమయ్యాడో మరి, కొద్ది నిముషాలవరకూ పోర్టరు పొలకువ నాకు తెలియకుండా వుండిపోయింది.

అప్పుడు నేను ఇంజనుకు పదిబారల దూరంగా నిలబడి వున్నాను.

"చూచావా అర్థంపర్థం లేని పొరపాట్లు ఎలా జరిగిపోతాయో! ఎందుకిలా జరిగిందని నాకూ అంతుబట్టలేదనుకో! దిగివద్దామనుకుంటుండగా జరిగిన పొరబాటేమిటో తెలిసొచ్చింది...." గార్డు మందలిస్తున్నాడు.

"వెరీసారి! మన్నించండి సార్! 'కార్నరు'లో పెట్టబోతుండగా 'పిక్కార్' చేతిలోంచి జారి క్రిందపడిపోయింది. దిగివెళ్ళి తెచ్చుకోకపోతే తప్పేది కాదు...." డ్రయివరు చెబుతున్నాడు.

"పోనీలే ఏం చేద్దాం! ఇకమీద ఎప్పుడూ ఇలా జరగకుండా జాగ్రత్త పడాలి. నువ్వు డ్యూటీలో వుండగా యిలా జరగడం యిదే మొదటిసారి!"

దొరికింది. నా సహేతుకమైన కారణం నాకు దొరికింది. రైలాగిపోవడానికి కారణం డ్రయివరు చేతిలోనుంచి ఒకానొక సాధనం క్రిందికి జారిపోవడం.

వెనువెంటనే ఇంకొక ప్రశ్న!

ఎన్నడూ జరగని పొరబాటు సరిగ్గా ఆ నిమిషంలోనే ఎలా జరిగింది! మళ్ళీ ఇందులో గూడా ఏ మానవాతీతమైన శక్తియైనా ప్రమేయం వుండవచ్చునా!

*　　　*　　　*

మరునాటి సాయంకాలం ఏడుగంటలప్పుడు గవర్మెంటు ఆసుపత్రిలో నేనొక సిమెంటు బెంచీపైన కూర్చుని కాలహరణం చేస్తుండగా 'హెడ్మాస్టరు వెంకట్రావుగారు అడ్మిట్ చేసిన పేషంటు ఏ గదిలో వున్నాడండీ!' అని వాకబు చేస్తూ ఒక వ్యక్తి వసారావెంట నడచిరావడం కనిపించింది.

లేచి ఎదురుగా వెళ్ళి 'ఆ పేషంటు వుండడం ఈ గదిలోనేనండీ! మీరు మురహరికి బంధువులా?' అని ప్రశ్నించాను.

నా ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పకుండా అతడు "ఇప్పు డెలా వుందండీ! ఇంతకూ జబ్బేమిటి?" అంటూ గదిలో ప్రవేశించాడు.

మంచంపైన ఒక వారగాకూర్చున్న మురహరిభార్య మమ్మల్ని చూడగానే లేచి నిల్చుంది.

ఆగంతకుడు రోగి పరిస్థితిని గమనిస్తుండగా నా కతడివైపు పరిశీలనగా చూసే అవకాశం కలిగింది. ఈ ముఖాన్ని ఎక్కడో చూచిన గుర్తు. ఎక్కడ చూచానోమరి. చప్పున జ్ఞాపకం రావడంలేదు.

బంధువైవుంటే యితణ్ణి మురహరి భార్య పలకరించి వుండేది. పోనీ స్నేహితుడైవుంటే తనను తానే ఆమెకు పరిచయం చేసుకుని వుండేవాడు. రెండింటిలో ఏ ఒక్కటీ జరగకపోవడంగూడా కాస్తా విస్మయాన్నే కలిగించింది.

'గాఢంగా నిద్రపట్టినట్టుంది కదూ! పరవాలేదు, జబ్బుతగ్గుముఖం పట్టినట్టే!' — స్వగతంలా పలుకుతూంటూ వసారాదాకా వచ్చి అతడక్కడ ఆగిపోతూ

వన్నడిగాడు. 'అన్నట్టు హెడ్మాస్టరుగా రెక్కడండీ? ఎంతో కాలమయింది ఆయన్ని కలుసుకొని? ఒకసారి వారితో మాటాడి పోదామనే వచ్చాను.'

ఆయన ఉదయం బస్సుదస్సుకే వెళ్ళిపోయారని చెప్పాను.

'అలాగా? నే నొచ్చి వెళ్ళినట్టుగా చెబుతారు గదూ?'

"చెబుతాలెండి? మీ పేరు?"

అప్పటికి మేము మాట్లాడుకుంటూ సిమెంటు బెంచిదగ్గరకి వచ్చాము.

'సత్యనారాయణ? నరసింగాపురం సత్యనారాయణ అనండి, తెలుస్తుంది. ఎందుకంటారేమో? నాకేమో ఆయనొకరే హెడ్మాస్టరుగారు. ఆయన కెందరో నాలాంటి శిష్యులు?'


అప్పటికది వట్టి ఉపోద్ఘాతం మాత్రమే అయినట్టు, చెప్పవలసిందంతా యికముందే వున్నట్లు అతడు చేతిగుడ్డను బెంచీపైన పరచి, నింపాదిగా దానిపైన కూచున్నాడు.

"ఈ పుణ్యభూమిలో ఆఖరుకొక్క కుక్క వస్తుపడుకున్నా సరే, తనకు పూర్వగతులు వద్దు పొమ్మన్నాడు వివేకానందుడు. దరిద్రనారాయణుడి సేవ కోసం అవసరమైతే మళ్ళీ మళ్ళీ యిలాంటి వెయ్యి జన్మలెత్తడానికైనా తాను సిద్ధమేనన్నాడు. కర్తవ్య సాధనకోసం జీవితాన్ని మీదుకట్టేవాళ్ళ పద్ధతి అది? లోకం దృష్టిలో అలాంటివాళ్ళు పిచ్చివాళ్ళగానే కనిపించవచ్చు ననుకోండి? ఆ మాటకొస్తే వాళ్ళుగూడా లోకాన్ని ఖాతరు చెయ్యరు. అడగడం మరిచాను, మీరేం చేస్తుంటారండీ?'

ప్రస్తుత నివాసం బాణావరమేననీ, మురహరికి సహోద్యోగిననీ చెప్పుకున్నాను.

'చూడండి మేష్టరుగారూ? లోకాన్ని ఖాతరుచేయకపోవడమంటే ఏమిటి అంటారు? లోకం ఏర్పాటుచేసిన సాంప్రదాయాన్ని మన్నించకపోవడమన్న మాట? ప్రతి అల్లాటప్పావాడూ చేయగలడంటారా అంతటి పని? వేమన్నగారట, గుడి ముంగిట చింకి పాతలతో గజగజ వణికిపోతున్న బిచ్చగత్తెను చూచాడట. వెంటనే గుడిలోపలికి వెళ్ళి అమ్మవారికి చుట్టబెట్టిన పట్టుచీరెను లాక్కొచ్చి ఆ దీనురాలికి కప్పేశాడట? అయ్యో? ఇంకేమైనా ఉందా? తప్పుగదూ? అమ్మవారు కళ్ళు పొడిచెయ్యదూ? అనుకోడం మానవ స్వభావం. గాళ్ళు దేవుళ్ళయితే రాసుల్ని మ్రింగునా అనగలిగే చేవ కోటికొక్కడికి మాత్రమే వుంటుంది.

సత్యనారాయణ అనే ఆ అపరిచితుడు ఎదుటి మనిషి తన వాక్యాంశాలను




ఏ మాత్రం అవగాహన చేసుకుంటున్నాడో తెలుసుకొనే నిమిత్తం కొద్ది క్షణాలు విరామం యిచ్చి 'ఎందుకు చెబుతున్నానంటే' అంటూ పునరారంభం చేయబోయాడు.

'చెప్పండి. మీరు విషయం చెప్పండి చాలు కారణాల్ని నే నూహించుకుంటాను' అన్నాను.

"ఒకసారి హైస్కూల్లో పరీక్షలు జరుగుతున్నాయి. ఒక పరీక్షకు నేను అరగంట లేటుగా గానీ వెళ్ళలేకపోయాను. నూట రెండు డిగ్రీల జ్వరం తీవ్రతలో వాడిపోయిన తోటకూర కాడలా డస్కుపైన సోలిపోతున్నాను. ప్రక్కనే కూచుని హెడ్మాస్టరుగారు కాఫీ త్రాగించారు. 'ఏం భయపడొద్దు బాబూ! నీ చేతనైనంతవరకే వ్రాయి. వీలుగాకపోతే మానెయ్యి' అంటూ బుజ్జగించారు. వింటున్నారా మేష్టారుగారు! పరీక్షలో నేను పాసయ్యేటందుకు కావలసిన మినిమమ్ మార్కులకన్నా అయిదు మార్కులు తక్కువగా వచ్చాయి ..."

"..............................."

"మిగిలిన సబ్జక్టులలో ఎన్ని మార్కులొచ్చాయని అడగలేదే మీరు! వాటిలో బాగానే వచ్చాయి. కానీ ఏం లాభం ఆ రోజుల్లో రూల్సు చాలా స్ట్రిక్టుగా వుండేవి. ఈ విద్యార్థి తప్పనిసరిగా యింకొక సంవత్సరం అదే క్లాసులో వుండవలసిందేనని, హెడ్మాస్టరు మినహాగా మిగిలిన హైస్కూలు పరీక్షలకమిటీ

నిర్ణయించింది. ఐతే కమిటీ నిర్ణయానికి వ్యతిరేకంగా, పరీక్షల నిబంధనలను త్రోసి రాజంటూ నా పేరు ప్రమోషనులిస్టులో కనిపించింది. ఇక చూచుకోండి తమపై గిట్టనివాళ్ళు పై అధికారులకు ఆకాశరామన్న ఉత్తరాలు వ్రాసి పడేశారు. డి.ఇ.ఓ. గారు ఎంక్వయిరీ కోసం రెక్కలు గట్టుకుని వచ్చి వాలిపోయారు. ఎన్ని విధాలుగా తర్కించి అడిగినా హెడ్మాస్టరుగారు చెక్కుచెదరకుండా ఒక్కటే మాటపైన కూచున్నారు. 'వాడు నా స్టూడెంటు. వాడెలాంటి స్టూడెంటయిందీ నాకు తెలుసు. వెధవ ముదనష్టం అయిదు మార్కులకోసం వాణ్ణి ఫెయిల్ చెయ్యమంటారటండీ! మిగిలిన వాటిల్లో అరవైలూ, డెబ్బయిలూ రాగా ఒక సబ్జక్టులో అయిదు మార్కులు తక్కువ కాగానే యిక వాడు పై తరగతికి పనికిరాడంటారా? ఆ మాత్రం యోగ్యతను గుర్తించి ఒక స్టూడెంటును పాసు చేసే అధికారమైనా లేకపోతే యిక నాకీ హెడ్మాస్టరుగిరీ ఏం చేసుకోడానికండీ! మీ కొక నమస్కారం! దీన్ని నేను తప్పనుకోలేదు, కర్తవ్యమనుకున్నాను. తర్వాత మీ యిష్టం అనేశారు. పాపం, డి.ఇ.ఓ. గారు మాత్రం ఏం చేస్తారు? ఈ మొండివాడితో గొడవెందుకనుకుని విషయ వివరణ చేస్తూ ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఈ ఒక్క కేసును మాత్రం మన్నించవలసిందిగా డైరెక్టరు గారికి సిఫార్సుచేసి తమ పాట్లేవో తాము పడ్డారు...."

సత్యనారాయణ కథనం వల్ల నాకొక విషయం తెలిసింది. వెంకట్రావు గారు ఉండుండీ ఒక అవకతవక పని చెయ్యడమనేది అర్ధాంతరంగా వచ్చింది గాదు. ఇదాయనకు ఆదినుంచీ వున్న జబ్బేనన్న మాట!

మరికొంత సేపటివరకూ, అలాగే లోకాభిరామాయణంతో కాలం వేగించి 'ఇక వెళ్ళొస్తానండీ' అంటూ లేచి నిల్చున్నాడు సత్యనారాయణ.

"రేపాదివారం గదా! హెడ్మాస్టరు గారొస్తే రావచ్చు. రేపు సాయంకాలం వచ్చి వెళ్లండి" అన్నాను

"అబ్బే, వీల్లేదండీ! రేపు నాకు నైట్‌డ్యూటీ వుంటుంది" అన్నాడు సత్యనారాయణ.

"నైట్‌డ్యూటీయా! ఏ డిపార్టుమెంటులో వున్నారు?"

"రైల్వేలో పనిచేస్తున్నానండీ, డ్రయివరుగా!"

చివరి మాట చెవిలో పడేసరికి నా సందేహం పొగమంచులా విచ్చిపోయింది. రెండు పర్యాయాల్లోనూ మొదటిసారి యూనిఫారంలో చూచాను గనుక రెండోసారి మామూలు దుస్తుల్లో యితణ్ణి గుర్తుపట్టలేకపోయి వుంటాను.

కథకంతా కీలక ప్రాయమైన సంఘటనకు నా కిప్పుడొక సంజాయిషి దొరికినట్టయింది. ఇతడి చేతిలోనుంచీ 'పిక్కర్' జారి క్రింద పడిపోవడం కేవలం ఒక పొర్పులాంటి సంఘటనే కావచ్చు. బండిని కాసేపు నిలబెట్టడం కోసం ఒక సాకుగా ప్రయత్నపూర్వకంగానే యితడా పనిముట్టును జారవిడచి వుండవచ్చుననుకోవడానికి ఎంతైనా అవకాశం వుంది.

ఎలాగైతేనేం, కొండను త్రవ్వడమంత పెద్ద ప్రయత్నం చేయకుండానే నేను ఎలుకను పట్టేయగలిగాను.

* * *

జాణావరం వచ్చేసరికి వెంకట్రావుగారి వ్యక్తిత్వం చుట్టూ అద్భుతమైన 'యిమేజి' ఒకటి నెలకొని వుండటం గమనించాను. వూరి ప్రక్కన రైలుదారి ఏర్పడి నూరేళ్ళు దాటింది. నాటికీ నేటికీ రైలొకసారి స్టేషను నుంచి కదిలిన తర్వాత మార్గమధ్యంలో దాన్ని ఆపివెయ్యగలిగిన మానవమాత్రుడెవడూ లేడు, ఒక వెంకట్రావుగారు తప్ప.

అది వట్టి అపోహ అని నాకు తెలుసు. అవసరమైతే నిరూపణ చెయ్యగలను కూడా! కానీ తీరా నా వాదం విన్న తర్వాత ఈ మూఢజనులు నాపైనే తిరగబడి 'అలాగైతే ఆరోజు బండిలో సత్యనారాయణ అనే అదే డ్రయివరు రావడం ఎలా సంభవించింది? అందుకైనా కారణం వెంకట్రావుగారి ఆత్మబలం కాదా!" అంటూ ప్రశ్నించి, నన్ను నిరుత్తరుణ్ణి చేస్తారేమోనన్న భయం నాకుండనే వుంది.

ఐతే ఒకటి. తన చుట్టూ చోటుచేసుకున్న 'యిమేజి'నే వెంకట్రావుగారు తన చేజేతులా దులిపివెయ్యజూడడం గూడా పిచ్చితనంలో ఒక అంశమేనేమో. "అబ్బే, యిందులో నేను చేసిన యింద్రజాలమేముందయ్యా! ఒక మనిషి చావుబ్రతుకులతో వున్నాడని తెలియగానే డ్రయివరు బండిని ఆపేసి వుంటాడు. 'రూలు' కన్నా మనిషి ముఖ్యంగదా" అంటుంటారాయన.

